ప్రజాశక్తి
గురువారం 6 ఫిబ్రవరి 2025
5
శ్రీ సత్యసాయి





మిషన్ కుడుతున్న మంత్రి సవిత



ఉద్యానవన సమ్మేళనంలో పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యేలు, అధికారులు

ఫ్రూట్‌బౌల్ ఆఫ్ ఇండియాగా అనంత

- రైతు సంక్షేమానికి కట్టుబడిన ప్రభుత్వం
- ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్
- అనంతలో 'ఉద్యానవన సమ్మేళనం'
- పాల్గొన్న వివిధ కంపెనీల ప్రతినిధులు
- 7 కంపెనీలతో ఎంఒయులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



మాట్లాడుతున్న పయ్యావుల కేశవ్



కాలవ శ్రీనివాసులు



పరిటాల సునీత



జెసి.ప్రభాకర్‌రెడ్డి

అనంతపురం జిల్లాను 'ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఎపి'గానే కాకుండా 'ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఇండియా'గా మారుద్దామని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని ఎంవైఆర్ ఫంక్షన్ హాలులో 'అనంత ఉద్యానవన సమ్మేళనం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ తొలి ఉద్యానవన సమ్మేళనంలో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, వ్యాపారవేత్తలు, రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ కార్యక్రమంలో ఉద్యావన పంటల ఉత్పత్తులతో పాటు, మార్కెటింగ్ వరకు జరగాల్సిన ప్రక్రియపై చర్చించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో పండే కొన్ని రకాల ఉద్యానవన పంటలకు దేశవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉందని చెప్పారు. దీన్ని మరింతగా విస్తరించాల్సిన అవసరముందన్నారు. అనంతపురం ఫ్రూట్ అంటనే ఒక బ్రాండ్‌ను రూపొందించాల్సి ఉందన్నారు. ఇప్పటికే ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఎపిగా పేరుందని, దీన్ని ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఇండియాగా మార్చే విధంగా కృషి చేయాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. కంపెనీలతో రైతులను అనుసంధానం చేసి రైతుకు ప్రయోజనం జరిగే విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. గతంలో



ప్రతినిధులతో ఎంఓయులు చేసుకున్న పత్రాలను చూపుతున్న మంత్రి కేశవ్, కలెక్టర్ వినోద్‌కుమార్

చంద్రబాబు నాయుడు డ్రిప్ సౌకర్యాన్ని తీసుకొచ్చే సమయంలో ప్రతిపక్షాలు హేళన చేసాయని, కాని ఇప్పుడు అది ఎంతగానో విజయవంతమైందన్నారు. రాబోయే రోజుల్లోనూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని మరింతగా రైతుకు మేలు చేసే విధంగా చూడాలని ఆయన చూస్తున్నారన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి టిజి భరత్ ఆన్‌లైన్ ద్వారా ప్రసంగించారు. అంతకు మునుపు జిల్లా ప్రజాప్రతినిధులు ప్రసంగించారు. విప్ కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో అరటి, మామిడే కాకుండా బొప్పాయి, దానిమ్మ పంటల సాగు కూడా ఉందన్నారు. వీటన్నింటికి సరైన మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని సూచించారు. మాజీ మంత్రి పరిటాల సునీత మాట్లాడుతూ డ్రిప్ సౌకర్యం ఇప్పుడు ఐదు ఎకరాలకే ఉందని, దానిని పది ఎకరాలకు పెంచాలని కోరారు. టమోటాకు గిట్టుబాటు ధర కల్పించాలని గుంతకల్లు ఎమ్మెల్యే జయరాం కోరారు. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తాడిపత్రి నుంచి ఇప్పుడు అరటి ఇతర దేశాలకు ఎగుమతి అవుతోందన్నారు. ఇలా ఎగుమతులు పెరగడం ద్వారానే రైతుకు మద్దతు ధర లభిస్తుందన్నారు.



రాజశేఖర్,వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి

ప్రతి ఏటా ఇటువంటి సమ్మేళం

రాజశేఖర్ వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి

పండ్ల ఉత్పత్తుల్లో అనంతపురం జిల్లా ప్రథమ స్థానంలో ఉందని చెప్పారు. దేశం నుంచి ఎగుమతి అయ్యే అరటిలో అత్యధికం అనంతపురం జిల్లా నుంచే ఉంటోందన్నారు. పంట ఉత్పదన, అమ్మకం మధ్యనున్న నష్టాన్ని తగ్గించడం, ఎగుమతుల ద్వారా రైతుకు గిట్టుబాటు ధర అందే విధంగా చూడటం వంటి చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. రైతులను మరింతగా ప్రోత్సహించేందుకు ఇటువంటి సమ్మెళనాలను ఏటా నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.



కలెక్టర్ వినోద్‌కుమార్

హార్టికల్చర్ హబ్ నుంచి హార్టికల్చర్ ఇంజన్‌గా మర్పు

కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతను హార్టికల్చర్ హబ్ నుంచి హార్టికల్చర్ ఇంజన్‌గా మార్పు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే అనంతపురం జిల్లా ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఇండియా ఉందన్నారు జిల్లాలో ఉద్యానవన పంటల ద్వారా చేకూరుతున్న ఆదాయం రూ.16 వేల కోట్లు ఉంటోందన్నారు. ఇప్పుడున్న విలువను రాబోయే రోజుల్లో 25 శాతం పెంచే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. దీనికి అనుగుణమైన మార్పులు తీసుకొస్తామన్నారు. ప్రస్తుతం జిల్లాలో 25 లక్షల మెట్రిక్ టన్నులు ఉందన్నారు. దీన్ని రాబోయే రోజుల్లో 29 లక్షల మెట్రిక్ టన్నులకు తీసుకుపోవాలన్నది లక్ష్యమన్నారు. అందుకు అనుగుణంగా అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, యాజమాన్య పద్ధతుల, మార్కెటింగ్ సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సురేంద్రబాబు, బండారు శ్రావణి, ఎపి హార్టీకల్చర్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఫుడ్ ప్రాసెసింగు సొసైటీ సిఇఒ శేఖర్ బాబు, తదితరు పాల్గొన్నారు.

వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్ ఏర్పాటు - 7 ఎంఒయులు

ఉద్యానవన సమ్మెళనంలో 13 స్టాళ్లు ఏర్పాటు చేయగా మంత్రి, ఎమ్మెల్యేలు వాటిని పరిశీలించారు. వాటి గురించి ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ఎలైట్ బయో టెక్నాలజీస్, సీనాగ్రో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డిజిటల్ గ్రీన్, సంకల్ప్ రిటైల్ స్టోర్, రామ డ్రిప్ సిస్టమ్స్, కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, బాయర్ క్రాఫ్ సైన్స్ లిమిటెడ్, జిఎం పవర్ సిస్టమ్స్, ఎకో జెన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇఫ్కో, ఫసల్, మొబిటెక్ వైర్లెస్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, నెట్ ఫిమ్ ఇరిగేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు వారి ఉత్పత్తులను స్టాల్స్ నందు ప్రదర్శించి, వాటి ఉపయోగాలను తెలియజేశారు. ఉద్యాన సమ్మేళనంలో 7 కంపెనీలు ఎంఒయులు కుదుర్చుకున్నాయి. ఈ కార్యక్రమంలో కంపెనీలు, రైతులు 11 మంది అవార్డులు అందుకున్నారు.

చేనేతకు పూర్వ వైభవం తెస్తాం

- యువతకు శిక్షణతో పాటు ఉపాధి
- మహిళలకు రుణసదుపాయం
- బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత

ప్రజాశక్తి-హిందూపురం

ఆదరణకు నోచుకోలేక వెనుకబడిన చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకురావాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుకు వెళ్తున్నారని బిసి సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవితమ్మ తెలిపారు. బుధవారం పట్టణంలోని గుడ్డం రంగనాథ స్వామి ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన చేనేత పారిశ్రామిక శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి కుట్టు మిషన్‌లో బట్టలు కుట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్, టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త శ్రీనివాసరావు, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు, టిడిపి జిల్లా అధ్యక్షులు అంజినప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హిందూపురంలో చేనేత శిక్షణ కేంద్రాన్ని టిడిపి తప్పా ఏ పార్టీనూ పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణ ఈ ప్రాంతంలో చేనేతతో పాటు మహిళలు, యువకులకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాలని ప్రత్యేక చొరవ చూపారన్నారు. అందులో భాగంగానే శిక్షణ కేంద్రాన్ని పున్ణ ప్రారంభించినట్లు చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివద్ధి చేసేందుకు ముందుకెళ్తున్నారన్నారు. చేనేతకు పూర్వ వైభవం తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందన్నారు. చేనేతలో యువతీ యువకులకు శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి కల్పిస్తున్నారు. మహిళలకు కుట్టులో శిక్షణ ఇవ్వడంతో పాటు కుట్టు మిషన్లను ఉచితంగా అందిస్తామన్నారు. ఆర్థిక తోడ్పాటుకు బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తామన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఎన్నికల హామీలన్నింటినీ అమలు చేసేలా చంద్రబాబు ప్రణాళికతో ఉన్నారన్నారు. ఇప్పటికే పింఛన్ పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్ అందిచామన్నారు. త్వరలో తల్లికి వందనం, ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం, రైతు భరోసా తదితర పథకాలు అమలు చేస్తామన్నారు. చేనేత కార్మికులకు వివిధ రకాల సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారిని ప్రోత్సహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ అధికారులతో పాటు పలువురు కౌన్సిలర్లు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



వ్యర్థాలను పరిశీలిస్తున్న అధికారులు

నిబంధనలు అతిక్రమిస్తే అనుమతుల రద్దుకు సిఫార్సు

కాలుష్య నియంత్రణ శాఖ ఈఈ ముని ప్రసాద్

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం తూముకుంట, గోళాపురం పారిశ్రామిక వాడల్లో ఉన్న పరిశ్రమ నిర్వాహకులు కాలుష్య నియంత్రణ శాఖ నిబంధనలు అతిక్రమిస్తే, అలాంటి పరిశ్రమల అనుమతుల రద్దు చేయాలని కోరుతూ ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని కాలుష్య నియంత్రణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ముని ప్రసాద్ హెచ్చరించారు. కాలుష్య కాటు అనే శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి కాలుష్య నియంత్రణ శాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ముని ప్రసాద్ పారిశ్రామిక వాడలో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా పరిశ్రమ నిర్వాహకులతో పాటు గ్రామస్తులు, కార్మిక సంఘం నాయకులు, పర్యావరణవేత్తలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ముని ప్రసాద్ వ్యర్థాలను వేసిన ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ, రసాయన పరిశ్రమల నిర్వాహకులు తప్పనిసరిగా ఈటిపిసి ని వినియోగించాలన్నారు. పర్యావరణ శాఖ అధికారులతో పాటు ప్రభావిత గ్రామ పెద్దలు, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు, పర్యావరణవేత్తలతో పాటు కార్మిక సంఘం నాయకులతో కలిపి ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కమిటీ ప్రతి నెల పరిశ్రమలతో పాటు వ్యర్థాలను వేసిన ప్రాంతాలను పరిశీలించి నివేదికను జిల్లా కలెక్టర్, పోలీస్ అధికారులకు అందించడం జరుగుతుందన్నారు. దీంతోపాటు పారిశ్రామిక వాడలో కొన్ని ప్రాంతాలను గుర్తించి నిత్యం పరిశీలించడానికి సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ శాఖ అధికారులతో పాటు ప్రభావిత గ్రామస్తులు, పర్యావరణ వేత్త భాస్కర్ రెడ్డి, రసాయన పరిశ్రమల నిర్వాహకులు పాల్గొన్నారు.

వికలాంగ క్రికెటర్‌కు ఆర్థిక చేయూత

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ప్రాంతానికి చెందిన వికలాంగ క్రికెటర్ వసంత్ కుమార్ కు పలువురు క్రీడాభిమానులు ఆర్థిక సహకారం అందించారు. బుధవారం వైసిపి కార్యాలయంలో వైసిపి నాయకులు వేణురెడ్డి తనవంతుగా వసంత్ కుమార్ కు ఆర్థిక సహకారం అందించారు. అదేవిధంగా లేపాక్షి దేవాలయ కమిటీ ఛైర్మన్ కరణం రమానందన్ రూ. 5 వేలు అందజేశారు. ఈ నెల 15 నుండి 18వ తేదీ వరకు నేపాల్లో జరిగే టీ-20 సిరీస్ కు ఇండియన్ జట్టుకు వసంత్ కుమార్ సారథ్యం వహిస్తున్నారు. వసంత్ కుమార్ టోర్నమెంట్ లో రాణించి భారత జట్టుకు అగ్రభాగాన నిలబెట్టాలని వారు ఆకాంక్షించారు. అనంతరం వసంత్ కుమార్ ను ఘనంగా సత్కరించారు.

వైఎస్. జగన్‌ను కలిసిన పుట్టపర్తి యూత్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తి మండల వైసిపి యూత్ లీడర్లు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని కలిసి తమపై పెట్టిన కేసుల గురించి వివరించారు. బుధవారం తాడేపల్లిలోని జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయనను మునిసిపాలిటీ పరిధిలోని పెద్ద కమ్మవారి పల్లికి చెందిన వైసిపి యువ నాయకులు సందీప్ నాయుడు, సతీష్ చౌదరి కలిశారు. ఈ సందర్భంగా పుట్టపర్తిలో నెలకొన్న సమస్యలు జగన్ దృష్టికి తీసుకువెళ్లినట్లు వారు తెలిపారు. కూటమి ప్రభుత్వం తమపై అక్రమ కేసులు బనాయించిందని జగన్‌కు తెలిపామన్నారు. స్పందించిన జగన్ అధైర్య పడకండని పార్టీ అండగా ఉంటుందని, అన్ని విధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారని అన్నారు.

అక్రమాలకు తావివ్వొద్దు : జేసీ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వం చౌక దుకాణాల ద్వారా అందిస్తున్న నిత్యావసర సరుకులు పంపిణీలో డీలర్లు ఎలాంటి అక్రమాలకు తావివ్వకుండా పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లో సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో పలు సూచనలు చేశారు. జెసి తో పాటు డిఎస్ఒ వంశీకృష్ణారెడ్డి, పౌర సంబంధాల జిల్లా మేనేజరు అశ్వర్థ నాయక్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రేషన్ డీలర్లు నిత్యావసర సరుకులను ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా నిష్పక్షికంగా పంపిణీ చేయాలని అందుకు అధికారులు చౌక దుకాణాలను తరచూ తనిఖీలు చేయాలని చెప్పారు. ఎక్కడైనా అక్రమ రవాణా జరిగినా సక్రమంగా నిత్యవసర వస్తువులు సరఫరా చేయడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.



సర్పంచి పంచరత్నమ్మను అభినందిస్తున్న కలెక్టర్

ఉత్తమ సర్పంచికి కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఉత్తమ సర్పంచిగా అవార్డు అందుకున్న నల్లచెరువు మండల కేంద్రం సర్పంచి పంచరత్నమ్మను కలెక్టర్ టిఎస్ చేతన్ అభినందించారు. గణతంత్ర దినోత్సవ సందర్భంగా సర్పంచి పంచరత్నమ్మ ఢిల్లీలో అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో ఆమె బుధవారం స్థానిక కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని సత్యసాయి జిల్లాలోని సర్పంచికి ఉత్తమ అవార్డు రావడం మంచి పరిణామం అని అన్నారు. జిల్లాకు గర్వకారణం అన్నారు. ఈ సర్పంచిను ఇతర సర్పంచులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గ్రామాలు అభివృద్ధి అయితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈసందర్భంగా సర్పంచి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన అనేక సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోనే తమ పంచాయతీకి ఉత్తమ అవార్డు రావటం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఒ సమత, పంచాయతీ కార్యదర్శి నరేష్, డివిజనల్ పంచాయతీ అధికారి కదిరి అంజనప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఉచిత సేవలు : యుటిఎఫ్

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

యుటిఎఫ్ ఆధ్వర్యంలోఉపాధ్యాయులకు,ఉద్యోగులకు ఉచిత సేవలను ప్రారంభించామని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రా రెడ్డి తెలిపారు. ధర్మవరం జోన్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు 2024 - 2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇన్‌కమ్ టాక్స్ (ఐటి) రిటర్న్ ఉచితంగా చేసి ఇస్తున్నామన్నారు. అలాగే మెడికల్ రియింబర్స్‌మెంట్ ఆన్లైన్ అప్లోడ్, ఉపాధ్యాయుల టిఐఎస్ తదితర అన్ని రకాల ఆన్లైన్ సర్వీసులు పూర్తిగా ఉచితంగా సంఘాలతో నిమిత్తం లేకుండా అందిస్తున్నామన్నారు. ధర్మవరం పట్టణంలో పాండు రంగా వీధిలో వున్న స్థానిక యు టీ ఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుండి 8 గంటల వరకు ఈ సదుపాయం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు రామకృష్ణ నాయక్, ధర్మవరం జోన్ నాయకులు ఆంజనేయులు, అమర్ నారాయణరెడ్డి, సకల చంద్రశేఖర్, హెచ్. రామాంజనేయులు, ఎం. వెంకట కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



హిందూపురంలో నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

కార్పొరేట్ల కోసమే మోడీ తపన

- లేబర్ కోడ్స్‌తో కార్మికుల హక్కులు హననం
- ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక బడ్జెట్
- సిఐటియు, రైతుసంఘం ఆధ్వర్యంలో లేబర్‌కోడ్స్, బడ్జెట్ ప్రతులు దహనం

"దేశంలో నరేంద్ర మోడీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన రోజు నుంచి నేటి వరకు ప్రజా, కార్మిక, రైతు సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్లకు మేలు చేసేందుకే అనునిత్యం తపన పడుతున్నారు. కార్మిక, రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారు. ప్రస్తుత బడ్జెట్‌లో కూడా ఎక్కడా వీరి సంక్షేమం గురించి ప్రస్తావన లేదు. కార్మిక, రైతు వ్యతిరేక పాలన సాగిస్తున్న మోడీ ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీయాలి'. అని సిఐటియు, రైతుసంఘం నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. కార్మిక చట్టాల రద్దు.. లేబర్ కోడ్స్ అమలు, బడ్జెట్‌లో కార్మిక, రైతు, ప్రజలకు నిధులు కేటాయించకపోవడంపై జిల్లా వ్యాప్తంగా సిఐటియు, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. లేబర్ కోడ్స్, బడ్జెట్ ప్రతులను దహనం చేశారు.

వార్త 6లో

కుల వివక్షపై చర్యలు తీసుకోవాలి : కెవిపిఎస్



గ్రామ దళితులతో కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి - మడకశిర

రొళ్ల మండలం మల్లినమడుగు గ్రామంలో కొనసాగుతున్న కుల వివక్షపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంవి రమణ, అధ్యక్షులు అన్నమయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం మల్లినమడుగు గ్రామంలో దళితులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాలు గడుస్తున్నా కులవివక్ష కొనసాగుతుండటం దారుణమన్నారు. అంటరానితనం నిర్మూలించడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. ఎన్ని రాజకీయ పార్టీలు అధికారంలోకి వచ్చినా ఓటు బ్యాంకు కోసం దళితులను వాడుకోవడం తప్ప వారికి చేసిందేమీ లేదని విమర్శించారు. ఏప్రిల్ 14వ తేదీన, డిసెంబర్ 6వ తేదీన అంబేద్కర్ విగ్రహానికి వంద రూపాయలు ఖర్చుపెట్టి పూల హారం వేసి అంబేద్కర్ ఆశయాలు కొనసాగిస్తామని వాగ్దానాలు చేయడం తప్ప అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చిందని లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్లినమడుగు గ్రామంలో ఇంటింటికి చదువుకున్న యువకులున్నారని అయినప్పటికీ గ్రామంలో చెప్పలేనంత వివక్ష కొనసాగుతోందని అన్నారు. స్థానిక తహశీల్దార్, ఎస్ఐ 105 జీవోను అమలు చేయడం లేదన్నారు. వీరు చట్టాలపై అవగాహన కల్పించి ఉంటే ఈరోజు ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదన్నారు. తమ గ్రామంలో వివక్ష ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఇంతవరకు ఎస్ఐగాని, తహశీల్దార్‌గాని గ్రామాన్ని సందర్శించలేదని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే కులవ్య వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణ పనులు అడ్డుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో ఎలాంటి గొడవలు జరిగిన ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ కన్వీనర్ బాధ్యత వహించవలసి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు , మురళి, పరమేష్ సురేష్ , రంగనాథప్ప రాజన్న , భూతరాజు, రంగనాథ్ , చంద్రప్ప , రెడ్డప్ప, ఎన్ తిప్పాయి స్వామి, నరసింహయ్య కదిరప్ప ,రంగప్ప, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ల కోసమే మోడీ తపన



కదిరిలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు



పుట్టపర్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

లేబర్ కోడ్స్‌తో కార్మికుల హక్కులు హననం
ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక బడ్జెట్
సిఐటియు ఆధ్వర్యంలో లేబర్‌కోడ్స్, బడ్జెట్ ప్రతులు దహనం

ప్రజాశక్తి - హిందూపురం

కేంద్రంలోని బిజెపి సంకీర్ణ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాసే విధంగా వ్యవహరిస్తోందని, ఎంతోమంది ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రూపుమాపే విధంగా ప్రయత్నాలు చేస్తే సహించేది లేదని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్ పి శ్రీనివాసులు హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ఇందిరాపార్క్ నుండి ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ సర్కిల్ లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జడ్పీ శ్రీనివాసులు, పట్టణ కన్వీనర్ వీఆర్ రాము మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా కార్మికులను కట్టు బానిసలుగా చేసేందుకు ప్రయత్నాలు చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక వర్గానికి ప్రస్తుతం అరకొరగా ఉన్న కార్మిక చట్టాలను కుదించడమే లేబర్ కోడ్లు ముఖ్య ఉద్దేశమని అన్నారు. కార్మికులు, రైతులను ఇబ్బందికరంగా మార్చే చట్టాలను అమలు చేయకుండా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అనుబంధ సంఘాల నాయకులు రికార్డ్ బి యూనియన్ నాయకులు సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సదాశివరెడ్డి, నందీశ్వర, లక్ష్మయ్య, మారుతి రెడ్డి, గంగాధర, నాగూరు నారాయణప్ప, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి జగదీష్, అధ్యక్షులు మల్లికార్జున, చంద్ర, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు ప్రాజెక్ట్ కార్యదర్శి అరుణ, సెక్టర్ లీడర్స్ శైలమ్మ, నాగమ్మ, విజయలక్ష్మి, హెల్పర్ అనిత, హాస్పిటల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి నాగరాజు, జాఫర్, హరి, ఆది తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కేంద్ర ప్రభుత్వం కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివిఎల్ నరసింహులు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక విధానాలకు వ్యతిరేకంగా, లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక టవర్ క్లాక్ వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.ఎల్ నరసింహులు, పట్టణ నాయకులు జగన్మోహన్, ముస్తక్ అలీ, రామ్మోహన్, మున్సిపల్ యూనియన్ నాయకులు బాలకృష్ణ, జనార్దన, శివకుమార్, రైతు సంఘం నాయకులు శంకర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి వ్యవసాయ పరిశోధన కేంద్రం కార్మిక సంఘం నాయకులు పద్మావతి, శారదాబాయి, ప్రజా సంఘాల నాయకులు బాబ్జాన్, రఫీ, ఆంజనేయులు, సుధాకర్, నౌషాద్, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం లేబర్ కోడ్‌లను కేంద్రం తీసుకు వచ్చిందని విమర్శించారు. ఇటీవల జరిగిన బడ్జెట్ సమావేశంలో లేబర్ కోడ్ లను అమలు చేస్తామని ప్రకటించడం దారుణమన్నారు.కార్మికుల హక్కులు హరించే లేబర్ కోడ్ లు రద్దు చేయకపోతే పోరాటాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

పుట్టపర్తి క్రైమ్ : పుట్టపర్తి పట్టణంలోని ఎనుములపల్లి గణేష్ సర్కిల్ లో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని చూస్తోందన్నారు.కార్మిక వర్గానికి ప్రస్తుతం ఉన్న కొద్దిపాటి హక్కులు కుదించడమే లేబర్ కోడ్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కార్మిక చట్టాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాపాడాలని డిమాండ్ చేశారు.ఉన్న హక్కులు లేకుండా చేస్తామంటే కార్మిక వర్గం తరపున పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పైపల్లి గంగాధర్, పెడబల్లి బాబా, బాబ్జ ఆంజి, శంకర్ రెడ్డి, రమేష్, ముత్యాలు, సుధాకర్, నాగరాజు మున్సిపల్ కార్మికులు పెద్దన్న, రామయ్య, నరసింహ మహిళా నాయకురాళ్లు నాగమణి, శ్రావణి, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కుదించడం అన్యాయమని సిఐటియు నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా బుధవారం ధర్మవరం పట్టణం కళాజ్యోతి కూడలి లో వున్న అంబేద్కర్ విగ్రహం ముందు సి ఐ టి యు, ఎ పి రైతు సంఘం నాయకులు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, సిఐటియు మండల కన్వీనర్ జె.వి రమణ, చేనేత కార్మిక సంఘం నాయకులు, ఎస్.హెచ్ బాషా, సిఐటియు మండల కో కన్వీనర్ టి.అయుబ్ ఖాన్, అలకుంట మారుతి తదితరులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను కేవలం నాలుగు కార్మిక కోడ్‌లుగా కుదిస్తోందన్నారు. అనేక పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను కుదిస్తూ కార్మికులకు తీరని ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. అదేవిధంగా ప్రత్యేక హోదా విషయంలో ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. వెనుకబడిన రాయలసీమ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, కడప లో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని, రాయలసీమకు నీటి సౌకర్యం కల్పించి కాలువలు ఏర్పాటు చేసి ప్రతి ఎకరాకు నీరు వెళ్లే విధంగా పిల్ల కాలువలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎల్. ఆదినారాయణ, చేనేత కార్మిక సంఘం నాయకులు గుంపు హరి, వి.వెంకట స్వామి, ప్రజా సంఘాల నాయకులు బొగ్గు నాగరాజు, జయ, దస్తగిరి, చౌడమ్మ, జయమ్మ, ఫాతిమా, లక్ష్మీదేవి, వరలక్ష్మి, గంగరత్న తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : లేబర్‌కోడ్‌కు వ్యతిరేకంగా సిఐటియు, సిపిఎం నాయకులు మండల కేంద్రంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సర్కిల్ నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి ఎన్టీఆర్ సర్కిల్ వద్ద రోడ్డుపై బైఠాయించి ముఖానికి నల్ల రిబ్బన్ ధరించి నిరసన తెలిపారు. సిఐటియు, సిపిఎం, ఆవాజ్ కమిటీ నాయకులు ఆటో పెద్దన్న ,బండల వెంకటేష్ ,పోతలయ్య ,బాబ్జాన్, బైలర్ ముత్తు, రహీం, రఫీ, హాజు తదితరులు మాట్లాడుతూ కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్రప్రభుత్వం రద్దుచేస్తోందన్నారు. కార్మికవర్గానికి ప్రస్తుతం వున్న కొద్దిపాటి హక్కులను హరించే ప్రయత్నాన్ని కేంద్రం చేస్తోందన్నారు. లేబర్‌కోడ్‌లను అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధమయితే కార్మిక వర్గం నిరవధిక సమ్మెకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.



ధర్మవరంలో నిరసన ర్యాలీ



ముదిగుబ్బలో నాయకుల నిరసన

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - నంబులపూలకుంట

మండల కేంద్రంలోని బిసి హాస్టల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌పి కుంటకు చెందిన పుల్లారెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి అన్నమయ్య జిల్లా గాలివీడు నుండి ద్విచక్రవాహనంలో ఎస్‌పి కుంటకు వస్తుండగా హాస్టల్ సమీపంలో ఉన్న దూడలు ఎదురు రావడంతో వాటిని తప్పించే క్రమంలో అదుపుతప్పి కిందికి పడ్డారు. ఈ ప్రమాదంలో పుల్లారెడ్డి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం రాయచోటి ఆసుపత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు.

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం ముదిగుబ్బ రైల్వే లైను మధ్యలో వున్న చిన్నయ కుంట పల్లి స్టేషన్ సమీపంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుని వయస్సు దాదాపు 35 సంవత్సరాలు ఉంటుందన్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు రైల్వే పోలీస్ స్టేషన్ నెంబర్ 9440627640: 9866715093కు తెలియజేయాలని కోరారు.

మామిడి తోటకు నిప్పు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మండలం కొటిపి గ్రామ పొలాల్లో ఆకతాయి చేష్టల కారణంగా మామిడి తోట కాలిపోయింది.కొందరు ఆకతాయిలు ఎండు గడ్డికి నిప్పు పెట్టడంలో తిప్పన్న అనే రైతుకు చెందిన మామిడి తోట కాలి బూడిదైంది. మామిడి తోట చుట్టూ గడ్డి ఎండిపోవడంతో అటుగా వెళ్లే ఆకతాయిలు నిప్పు పెట్టారు. మంటలు చెలరేగి తోటకు ఆనుకుని ఉన్న కంచికి అంటుకొని ఏపుగా పెరిగిన మామిడి చెట్లు కాలిపోయాయి. వేసవికాలంలో ఆకతాయిలు చేసే చేష్టలకు మామిడి తోట రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తిప్పన్నకు చెందిన మామిడి చెట్లతో పాటు డ్రిప్ పరికరాలు కాలిపోవడంతో సుమారు రూ.3 లక్షల వరకు నష్టం వాటినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి - తాడిమర్రి

ఈనెల 25, 26 తేదీల్లో నిర్వహించే శ్రీ కాటి కోటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఈ సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్ మెచ్చరించారు. ఈ మేరకు ఆయన బుధవారం కాటి కోటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఎస్ఐ కృష్ణవేణితో కలిసి ఆలయ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

హెచ్‌ఎం సస్పెన్షన్

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

గోరంట్ల మండలం వంక ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న జి. నాగేశ్వరరావు పై సస్పెన్షన్ వేటు పడింది.విద్యార్థినుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మంగళవారం గోరంట్ల పోలీస్ స్టేషన్ లో ఫోక్సో (బాలికల లైంగిక వేధింపుల నిరోధక చట్టం) కింద కేసు నమోదైంది. ఎంఇఒల విచారణను పరిగణలోకి తీసుకొని జిల్లా విద్యాశాఖ అధికారి జి. కష్టప్ప ప్రధానోపాధ్యాయుడు జి.నాగేశ్వరరావు పై సస్పెన్షన్ విధించారు.

బిపి మిషన్ అందజేత

ప్రజాశక్తి పెనుకొండ

పట్టణంలోని బిటిఆర్ కాలనీలో అంగన్వాడీ సెంటర్ కు పట్టణ పార్టీ కన్వీనర్ శ్రీరాములు యాదవ్ బిపి పరికరాన్ని బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్‌కు వచ్చే గర్భిణులకు బిపి చెకప్ చేసేందుకు ఈ పరికరాన్ని ఉపయోగపడుతుందన్నారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సుబ్రహ్మణ్యం, చంద్రాయుడు, కురుబ నంజుండ, బోయ నంజుండ, సోము తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి-హిందూపురం

జిల్లాస్థాయిలో ఉత్తమ సిఆర్ఎంటి ఎంపికైన రేణుక, ఉత్తమ అకౌంటెంట్ గా ఎంపికైన కేజీబీవీ పాఠశాల మానసను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ శివకుమార్ , ఎంఇఒ గంగప్ప, ప్రత్యేక అధికారి మాధవి మాట్లాడుతూ, క్రమశిక్షణ, పట్టుదల అంకితభావంతో విధులు నిర్వహిస్తే ఉన్నతాధికారుల నుండి తప్పకుండా గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్ఎంటిలు, ఎంఐఎస్ నందిని, కంప్యూటర్ ఆపరేటర్ తోసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు - పావగడ రోడ్డుకు మహర్దశ

ప్రజాశక్తి - మడకశిర రూరల్

బెంగళూరు నుండి మడకశిర మీదుగా పావగడ వెళ్లే రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. మడకశిర సమీపంలోని నేషనల్ హైవే దగ్గర నుండి పావగడ రోడ్డు లోని శివాలయం వరకు రోడ్డు అధ్వానంగా ఉండేది. ఏళ్ల తరబడి తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకునేవారు. దీంతో ప్రయాణికులకు వాహన చోదకులకు తీవ్ర ఇబ్బందిగా ఉండేది. ప్రస్తుతం ఈ రోడ్డును పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తున్నారు. పనులు శరవేగంగా సాగుతున్నాయి దీంతో ప్రయాణికులు వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

మండలంలోని ఆయా పంచాయతీల్లో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో రాబర్ట్ విల్సన్, తహశీల్దార్ అనంత ఆచారి తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఏ గ్రామంలోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగా సున్నంపల్లి పంచాయతీలో బోరుబావిని తవ్విస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ కేశవరెడ్డి, సర్పంచి దార లక్ష్మిదేవమ్మ, దార నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పు చేయాలని వినతి

ప్రజాశక్తి - లేపాక్షి

మండల పరిధిలోని బిసలమనేపల్లి పంచాయతీలో గల వెంకటాపురం, ఓబుళపురం గ్రామాల నుంచి జాతీయ రహదారికి వెళ్లే రోడ్డును వెడెల్పు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. ఈ మేరకు వారు బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో వెంకటాపురం అభి, నాగార్జున, అశోక్, గంగాధర్, అశ్వర్థనారాయణ, ప్రకాష్, నంజుండప్ప, రఘు, నారాయణ గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు కంట్రోల్ రూమ్

ప్రజాశక్తి - తనకల్లు

రాబోయే వేసవి కాలంలో మండల పరిధిలోని గ్రామ పంచాయతీల పరిధిలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు వస్తే పరిష్కరించడానికి ప్రత్యేక కంట్రోల్‌రూం ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ రెడ్డప్ప తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. తాగునీరు, పారిశుధ్య సమస్యల పరిష్కారానికి బి. రాజ కుమార్ నాయక్ ను ప్రత్యేకంగా నియమించినట్లు చెప్పారు. ఏవైనా సమస్యలుంటే 8500138406 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

రైతులకు శిక్షణ

ప్రజాశక్తి - నల్లచెరువు

పంటల సాగు, యాజమాన్య పద్ధతులపై ఈనెల 5న రైతులకు శిక్షణ ఇస్తున్నట్లు ఎడిఎ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ తరపున రైతులకు ఉన్న డ్రిప్పులు, స్ప్రింక్లర్లు 90 శాతం సబ్సిడీతో ఇస్తున్నామన్నారు. పొలం పిలుస్తుంది కార్యక్రమం లో రైతులకు పంట యాజమాన్య పద్ధతులను వివరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, గ్రూపు సెక్రటరీ వెంకటేశ్వర్లు, సైంటిస్ట్ రమేష్ నాయక్, భాస్కర్ రెడ్డి, అనితా, మండల వ్యవసాయ అధికారి భారతి, ఎఇఒలు, ఎంపిఇఒలు, సచివాలయం సిబ్బంది, ఆతియా కంపెనీ మండల కోఆర్డినేటర్లు, సీఈఓ వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

మండలంలోని బడనపల్లిలో అధికారులు బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎఒ మహమ్మద్ ముస్తఫా రైతులకు పంటల సాగుపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు సనావుల్లా, ఎఇఒ అశ్విని, గ్రామరైతులు పాల్గొన్నారు.

పిహెచ్‌సి తనిఖీ

ప్రజాశక్తి - ముదిగుబ్బ

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఎం అండ్ హెచ్‌ఒ బుధవారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రికార్డులను పరిశీఇంచారు. సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేంద్ర, సిహెచ్‌ఒ సరస్వతమ్మ, కమ్యూనిటీ ఆరోగ్య అధికారులు, సీనియర్ అసిస్టెంట్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు

పంట కోత ప్రయోగాలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

ఖరీఫ్ సీజన్లో వర్షాధార పంటగా సాగుచేసిన కంది పంటలలో అధికారులు పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. బుధవారం మండలంలోని రాఘవంపల్లి, ఈదుల ముష్టురు గ్రామాలలో ఏఎస్‌ఒ డాక్టర్ లక్ష్మీ నరసింహాశర్మ పర్యవేక్షణలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విహెచ్‌ఎ సత్యనారాయణ, అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ మండల కోఆర్డినేటర్ మంజునాథ, మనోజ్ తదితరులతోపాటు రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - బత్తలపల్లి

వలసల నివారణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులలో కొలతల మేరకు పనులు చేపడితేనే తదిగన కూలి దక్కుతుందని ఎంపీడీవో నరసింహనాయుడు పేర్కొన్నారు. బుధవారం మండలంలో అప్పరాచెరువు గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను ఉపాధి సిబ్బందితో కలిసి ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కూలీలతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కూలీకి కనీసం రూ. 300 వేతనం దక్కేలా పనులు చేయాలన్నారు. ముఖ్యంగా వేసవి ప్రారంభమవుతుండడంతో పనుల వద్ద వేసవి సదుపాయాలు కల్పించాలని ఉపాధి సిబ్బందికి సూచించారు.

గ్రామాల అభివృద్ధికి చర్యలు : మంత్రి



రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి సవిత

ప్రజాశక్తి గోరంట్ల, గోరంట్ల రూరల్

గ్రామాల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. ఈ మేరకు రూ. 1.14 కోట్ల వ్యయంతో చేపట్టిన మండలంలోని మేరెడ్డిపల్లి గ్రామానికి వెళ్లే బిటి రోడ్డును మంత్రి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రోడ్డు వేసి గ్రామానికి వస్తానని ఎన్నికల సమయంలో తాను ఇచ్చిన హామీని నెరవేర్చానని చెప్పారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. గోరంట్ల మండలంలో ఆరు కోట్ల రూపాయల నిధులతో సీసీ రోడ్లు డ్రైనేజీలు పనులు జరుగుతున్నాయన్నారు. సచివాలయ ఉద్యోగులు నిర్లక్ష్యంగా ఉంటే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పచ్చ అశోక్, బాలకృష్ణ చౌదరి, దేవా నరసింహులు, సోమశేఖర్, సుబ్బారెడ్డి, వేణు రాయల్, హరి, నరేష్, సుధాకర్ రెడ్డి, ఉత్తమ రెడ్డి, అజ్మతుల్లా, నిమ్మల శ్రీధర్, శ్రీనివాసులు, కిషోర్ రాయల్, అశ్వత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధం :జగన్ అయిదేళ్ల పాలనలో, సీఎం చంద్రబాబునాయుడు ఏడు నెలల కాలంలో చేపట్టిన అభివృద్ధిపై చర్చకు తాను సిద్ధమని మంత్రి సవిత స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగానైనా, నియోజక వర్గస్థాయిలోనైనా అభివృద్ధిపై చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. రాజకీయ స్వలాభంతో కొన్ని వలస పక్షులు వస్తూ పోతుంటాయని, ఈ విషయం తెలిసే నియోజక వర్గ ప్రజలు తనకు అత్యధిక మెజార్టీ ఇచ్చారని అన్నారు. జగన్ అసమర్థ పాలనను చూసే ప్రజలు వైసీపీకి 11 సీట్లకు పరిమితం చేశారన్నారు. గత అయిదేళ్లపాలనలో జగన్ రెడ్డి ఏనాడూ మీడియా ముందుకు రాలేదన్నారు. జగన్ అసమర్థతను చూసి వైసీపీకి చెందిన కీలక నేతలంతా ఆ పార్టీ నుంచి బయటకొస్తున్నారని అన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

పరిగి : మండలంలోని యర్రగుంట గ్రామ పంచాయతీ చెందిన వైసిపి నాయకులు మంత్రి సవిత ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. బుధవారం పెనుగొండ లోని టిడిపి కార్యాలయంలో వారు టిడిపిలో చేరారు. మాజీ సర్పంచి వెంకటరామప్పతో పాటు మరో 5 కుటుంబాలు మంత్రి సవితమ్మ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి టిడిపిలోకి చేరినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సూర్యనారాయణ, ఎర్రగుంట మూర్తి,నాగభూషణ, చంద్ర పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అభాగ్యులకు చేయూత

ప్రజాశక్తి - అమడగూరు



చిన్నారులతో ఆశ్రమ నిర్వాహకులు, తదితరులు

మండల కేంద్రంలోని గాజులపల్లి వద్ద ఉన్న శ్రీ మాతశ్రీ వృద్ధాశ్రమ నిర్వాహకులు ఇద్దరు అడపిల్లలకు చేయూతనందించారు. తల్లిదండ్రులు ఉన్నా వారి విబేధాల కారణంగా అభాగ్యులుగా మారిన వారిని అక్కున చేర్చుకున్నారు. అందుకు సంబంధించిన వివరాలు... పెనుకొండ మండలానికి చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తి తన భార్య, ఇద్దరు పిల్లలతో సోమందేపల్లిలో స్థిరపడ్డాడు. అయితే భార్యభర్తల మధ్య విబేధాల కారణంగా వారు విడిపోయారు. దీంతో వారి ఇద్దరి ఆడపిల్లలు అయిన శ్రావ్య, స్వాతిని పోషించడం అనారోగ్యం బారిన పడిన శ్రీనివాసులుకు భారంగా మారింది. వారి పరిస్థితిని సోమందేపల్లి వాసులు అమడగూరులోని శ్రీ మాతశ్రీవృద్ధాశ్రమానికి సమాచారం ఇచ్చారు. దీతో ఆశ్రమ నిర్వహకురాలు అరుణజ్యోతి సోమందేపల్లికి వెళ్లి పిల్లల పరిస్థితిని గమనించారు. వారిని ఆశ్రమానికి పంపడానికి వారి తండ్రి శ్రీనివాసులు అంగీకరించాడు. దీంతో సోమందేపల్లి గ్రామస్తుల సమక్షంలో సోమందేపల్లి ఎస్ఐ రమేష్‌కి ఫోన్‌ద్వారా పరిస్థితిని వివరించారు. అందరి అంగీకారంతో పిల్లలను తమ వృద్ధాశ్రమానికి తీసుకువచ్చామని వారి ఆలనా పాలనా తాము చూసుకుంటామని ఆశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతి తెలిపారు. ఈ విషయాన్ని స్థానిక ఎస్ఐ వెంకటనారాయణకు తెలపగా ఆయన కూడా సానుకూలంగా స్పందించారని వద్ధాశ్రమ నిర్వాహకురాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సోమందేపల్లివాసులు మోహన్, నారాయణ, అంజి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

విద్యార్థులు బాగా చదువుకుని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎంఇఒలు రాజేశ్వరి, గోపాల్‌నాయక్ కోరారు. మండల పరిధిలోని ధర్మపురి గ్రామ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జి సౌభాగ్యమ్మ పాఠశాల విద్యార్థులకు శతక కంఠస్థపద్యాల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో మండల విద్యాశాఖాధికారులు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు మంచి విషయాలపై శ్రద్ధ కనపర్చేలా చేసి వారిలో వున్న నైపుణ్యాన్ని మెరుగు పరచడం అభినందనీయమన్నారు. అదేవిదంగా విద్యార్థులకు శతక పద్యాలను నేర్పించిన ప్రధానోపాధ్యాయులు జి. సౌభాగ్యమ్మ, ఉపాధ్యాయులు కుళ్లాయప్ప, నాగరాజును ఎంఇఒలు అభినందించారు. ఈ కార్యక్రమంలో రావులచెరువు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలు చూపిస్తున్న విద్యార్థులు

ఆశా వర్కర్లపై వేధింపులు ఆపాలి : సిఐటియు



నిరసన వ్యక్తం చేస్తున్న ఆశాకార్యకర్తలు, సిఐటియు రమేష్

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

ఆశ వర్కర్ల పై వేధింపులు ఆపాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆసంఘం ఆధ్వర్యంలో ఆశావర్కర్లు పట్టణంలోని యూపీహెచ్సీ ముందు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ రెండు సంవత్సరాల నుంచి ఆశ వర్కర్లపై వేధింపులు అధికమయ్యాయని అన్నారు. వారు ఓపికతో పని చేసినప్పటికీ వైద్యాధికారి సౌమ్య కక్ష సాధింపుతో వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రతిరోజు ఆశ వర్కర్లను దుర్భాషలాడుతోందన్నారు. అంతేకాక ఆమె పట్టణంలో ప్రైవేట్ క్లినిక్ పెట్టుకొని విధులకు సక్రమంగా హాజరు కావటం లేదని విమర్శించారు. ప్రతి ఒక ఆశ వర్కర్ తన ప్రైవేట్ క్లినిక్‌కు 10 మందిని పేషెంట్లు తీసుకురావాలని బెదిరిస్తోందన్నారు.ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విచారణ జరిపి వైద్యాధికారి సౌమ్య పై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు తులసి, రాజేశ్వరి ,అలివేలమ్మ, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సవితకి వినతి : పట్టణంలోని యూపీహెచ్ సీ ప్రభుత్వ వైద్య అధికారి సౌమ్యపై సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు మంత్రిని కలిసి తమ సమస్యను విన్నవించారు. తమను వైద్యాధికారి సౌమ్య వేధింపులకు గురి చేస్తోందని వాపోయారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు తులసి, రాజేశ్వరి, అలివేలమ్మ, గౌతమి ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ పై చర్యలు తీసుకోవాలి: టిడిపి

పెనుకొండ : రోగులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న డాక్టర్ సాయి సౌమ్య పై చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ పట్టణ పట్టణ కన్వీనర్ శ్రీరాములు యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డాక్టర్ సాయి సౌమ్య కాంట్రాక్టు ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్నారన్నారు. విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లపై వైద్యురాలు నానా దుర్భాషలాడుతూ దురుసుగా ప్రవర్తిస్తోందని ఆరోపించారు. ఈ విషయంపై గతంలో మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లినప్పటికీ వైద్యురాలి తీరులో మార్పు రాలేదని తెలిపారు.